క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

గోల్కొండ: దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడే మహిళలతో పాటు సంతానం లేక బాధపడే వారికోసం ఈనెల 5న ఆదివారం ఉచిత గైనిక్ అండ్ ఫెర్టిలిటీ క్యాంపు నిర్వహిస్తున్నామని టోలిచౌకి నోషినా డయాగ్నొస్టిక్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నోషినా తెలిపారు. శనివారం టోలిచౌకిలోని నోషినా డయాగ్నొస్టిక్ సెంటర్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. రాబ్తా ఫౌండేషన్, యాంజిల్స్ ఫెర్టిలిటీ సంయుక్తంగా ఈ క్యాంపును నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. మెహిదీపట్నం–మల్లెపల్లి ప్రధాన రహదారిలో గల డాక్టర్ నోషినా నోబుల్ క్లీనిక్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ క్యాంపు ఉంటుందని ఆమె తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 98486 34640, 96522 78517లలో సంప్రదించవచ్చు.

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

గన్‌ఫౌండ్రీ: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. మోటర్ వెహికిల్ యాక్ట్ 2019ను సవరించాలని కోరుతూ.. శనివారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది కార్మికులు రవాణా రంగంలో పనిచేస్తున్నట్లు తెలిపారు. రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7న ఇందిరా పార్కు వద్ద చలో ఇందిరా పార్కు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఆసీఫ్, ప్రధాన కార్యదర్శి అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ తరానికి మఖ్దూం సాహిత్య స్ఫూర్తిని చాటి చెప్పాలి

గోరటి వెంకన్న



పురస్కారాలు అందుకున్న శ్రీనివాస్, జయరాజు

చార్మినార్: సమకాలీన సామాజిక పరిస్థితుల్లో మగ్దూం సాహిత్య స్ఫూర్తిని మరింత విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరముందని సుప్రసిద్ధ కవి, తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యుడు గోరటి వెంకన్న అన్నారు. సిటీ కాలేజీ పూర్వ అధ్యాపకులైన మఖ్దూం పేరు జాతీయ పురస్కారాన్ని ఉత్తమ సాహితీ వేత్తలకు 2019 నుంచి ప్రదానం చేస్తున్నారు. ఈ పురస్కారాన్ని 2022 సంవత్సరానికి గాను కవి జయరాజుకు, 2023 సంవత్సరానికి ఆంధ్రజ్యోతి సంపాదకులు డాక్టర్ కె.శ్రీనివాస్‌కు ప్రదానం చేశారు. ఈ ప్రదానోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకన్న మాట్లాడుతూ.. మఖ్దూం తాత్విక చైతన్యాన్ని తమ రచనల ద్వారా చాటి చెబుతున్న కె.శ్రీనివాస్, జయరాజులకు ఈ పురస్కారం ఇవ్వడం అత్యంత సముచితమైన నిర్ణయమని కొనియాడారు. నార్ల వెంకటేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు తరువాత అంతా నిజాయితీతో నిబద్ధతతో ప్రజాస్వామ్య భావజాలానికి ప్రాణం పోస్తున్న ఏకైక సంపాదకుడు శ్రీనివాస్ అని అన్నారు. ప్రకృతి తత్వాన్ని, అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని జయరాజు తన పాటల్లో కవిత్వీకరించాడని అన్నారు. ప్రజావాగ్గేయకారుల్లో జయరాజు శైలి విశిష్టమైందన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. కవిగా, నాటక కర్తగా, అధ్యాపకుడిగా, అనువాదకుడిగా, కార్మికోద్యమ నాయకుడిగా ఆనాటి తెలంగాణ సమాజంపై మఖ్దూం చూపిన ప్రభావానికి నేటికీ ప్రాసంగికత ఉన్నదని.. వర్తమాన పరిస్థితుల్లో అతని మార్గం అనుసరణీయమన్నారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి యాకుబ్ మాట్లాడుతూ.. స్వేచ్ఛ, స్వాతంత్ర్య, సౌభ్రాతృత్వం గురించి మగ్దూం చూపిన బాటలో ఇవాళ్ల అందరం నడవాల్సిన అవసరముందన్నారు. పురస్కారాన్ని అందిస్తున్న నిర్వాహకులు, అవార్డు గ్రహీతలు, సిటీ కళాశాల విద్యార్థులు మఖ్దూం తాత్విక వారసత్వాన్ని కొనసాగించాలన్నారు. సభకు అధ్యక్షతన వహించిన అవార్డు కమిటీ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. మగ్దూం సాహిత్య వ్యక్తిత్వాన్ని, ఉద్యమ కృషిని, అధ్యాపకుడిగా మఖ్దూం ప్రబోధించిన జ్ఞాన తత్వాన్ని ఈ తరానికి అందజేయాలని.. అతని పేరిట ప్రతి సంవత్సరం ఈ జాతీయ పురస్కారం అందిస్తున్నామన్నారు. అవార్డు కిమటీ ఆధ్వర్యంలో గోరటి వెంకన్న, అల్లం నారాయణ, డాక్టర్ బాల భాస్కర్, యాకుబ్ చేతుల మీదుగా కె.శ్రీనివాస్, జయరాజులకు సిటీ కాలేజీ మఖ్దూం మొహియుద్దీన్ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. రూ.10 వేల నగదు, జ్ఞాపిక, ధ్రువపత్రం, శాలువాతో గ్రహీతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని అవార్డు కమిటీ కన్వీనర్ డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, సభ్యులు డాక్టర్ యాదయ్య, డాక్టర్ రత్న ప్రభాకర్, డాక్టర్ కోయి కోటేశ్వర్ రావులు సమన్వయం చేశారు. పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వెల్చాల కొండలరావు, మఖ్దూం కుమారుడు జాఫర్ మొహియుద్దీన్, కొండపల్లి పవన్, పాశం యాదగిరి, మెర్సి మార్గరెట్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాతబస్తీ దినదినాభివృద్ధి చెందుతుంది: ఎంపీ అసదుద్దీన్



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

చాంద్రాయణగుట్ట: నగరానికి దీటుగా పాతబస్తీ దినదినాభివృద్ధి చెందుతుందని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. బండ్లగూడలో ఏర్పాటైన జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా మోటార్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన జాస్పర్ కార్ల షోరూమ్‌ను శనివారం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మచిలీపట్నం మాజీ ఎంపీ జాస్పర్ ఇండస్ట్రీస్ చైర్మన్ బాడిగ రామకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీకి పెద్ద పెద్ద షోరూమ్‌లు రావడం గర్వకారణమన్నారు. ఎండీ సుమంత్ బాడిగ, టాటా మోటార్స్ జోనల్ మేనేజర్ నితుల్ శర్మ, టెర్రిటరీ సేల్స్ మేనేజర్ రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు షాపులు కేటాయించండి



జోనల్ కమిషనర్‌ను కలిసిన రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: బేగంబజార్‌లో నిర్మించిన అధునాతన ఫిష్ మార్కెట్‌లో అర్హులైన వారందరికీ దుకాణాలు కేటాయించాలని రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో సమావేశమైన నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా ఫిష్ మార్కెట్‌పై జీవనోపాధి పొందుతున్నవారందరికీ దుకాణాలు కేటాయించాలన్నారు. మచిలిపురా ఫిషర్‌మెన్‌లతో పాటు పలువురు ఉపాధి పొందుతూ చాలా ఏళ్లుగా ఫిష్ మార్కెట్‌లో జీవనం గడుపుతున్నారన్నారు. గతంలోని వారందరికీ దుకాణాలు కేటాయించి న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ.. మంత్రి తలసాని అర్హులైన వారందరికీ దుకాణాలు కేటాయించాలని ఆదేశించినట్లు తెలిపారు. మంత్రి ఆదేశాలతో గతంలోని వారందరికీ, అర్హులైనవారందరికీ దుకాణాలు కేటాయించి న్యాయం చేస్తామని రవికిరణ్ హామీ ఇచ్చారు. గోపాల్ సింగ్ ఫతేసింగ్, శివదర్శన్ సింగ్, జైపాల్ సింగ్, పప్పు మాత్రే, ప్రదీప్‌రాజ్, సునిల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మఖ్దూంకు నివాళి



నివాళులర్పిస్తున్న జూలూరు గౌరీశంకర్

గన్‌ఫౌండ్రీ: దేశాన్ని మతభూతం ఆవహించిందని ఈ ప్రమాదం నుంచి దేశాన్ని కాపాడేందుకు ప్రజాస్వామిక లౌకిక శక్తులంతా ఏకం కావల్సిన సమయం ఆసన్నమైందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో మఖ్దూం మొహియుద్దీన్ 115 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనార్థులు, అనాథలు ఉండని నవ సమాజం కావాలని పోరాడుతూ తన జీవితాన్ని సమాజానికి అంకితం చేసిన గొప్ప కవి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలచారి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి



వేణుగోపాల్‌రావు

యాకుత్‌పురా: రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నగరంలోని నిరుద్యోగు యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వరంగ సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ వేణుగోపాల్‌రావు సూచించారు. పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగా యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. సరూర్‌నగర్ అవుట్ డోర్ స్టేడియంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న ఈ జాబ్ మేళాలో 108 కంపెనీలలో 10 వేల ఉద్యోగాలు భర్తీ చేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. పదవ తరగతి, ఇంటర్, అండర్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, బీఏ, బీకామ్, ఎంఏ, ఎంకామ్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, బీఈ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, హోటల్ మేనేజ్‌మెంట్, డ్రైవర్స్ అర్హతలు కలిగిన వారు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 91824 76721, 90148 46853, 63023 74845లలో సంప్రదించవచ్చు.

మజ్లిస్‌కు అన్ని వర్గాల ప్రజల అండ



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ అన్ని వర్గాల ప్రజల అండ ఉందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకిలోని మేరాజ్ కాలనీలోని తన కార్యాలయం వద్ద మజ్లిస్ నాయకులు, తనను కలవడానికి వచ్చిన వారితో మాట్లాడారు. మజ్లిస్ సెక్యులర్ భావజాలం గల పార్టీ అని ఆయన అన్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో సైతం దళితులకు, ముస్లిమేతరులకు ప్రజాప్రతినిధులుగా గెలిపించిందని ఆయన అన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి



డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుసేనిను సత్కరించిన ఏయిడెడ్ కాలేజ్ యూనిట్ నూతన కమిటీ

అబిడ్స్: ఉద్యోగుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తానని టీఎన్జీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, సేవారత్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుసేని పేర్కొన్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ఏయిడేడ్ కాలేజ్ యూనిట్ హైదరాబాద్ జిల్లా తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీ డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనిను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్యదర్శి విక్రమ్‌కుమార్, ఎన్నికల అధికారి రాజ్‌కుమార్‌తో పాటు నూతనంగా ఎన్నికైన యూనిట్ అధ్యక్షుడు ఎం.ఏ.కలీమ్, సహా అధ్యక్షుడు హారిసన్, ఉపాధ్యక్షులు రాజేందర్, శివకోటి, విజయలక్ష్మి, కార్యదర్శి సుమాన్, సంయుక్త కార్యదర్శులు ఎండీ నయుముద్దీన్, రమేష్, లక్ష్మి, కోశాధికారి ముఖేష్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీధర్ గౌడ్, ప్రచార కార్యదర్శి ప్రణయ్, కార్యవర్గ సభ్యులు రమేష్, గోవర్ధన్, విరున్, అజయ్‌సింగ్, భాష్య నాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి చర్యలు

యాకుత్‌పురా: డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ పేర్కొన్నారు. శనివారం ఆయన యాకుత్‌పురా, రెయిన్‌బజార్, ఎస్ఆర్టీ కాలనీ, మౌలాకా చీల్లా, యక్రబ్ నగర్, ధోబీఘట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి బస్తీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. బస్తీల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లు, తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపట్టి సమస్యలు లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మజ్లిస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం





సిరాజ్ ఉర్ రహ్మాన్ హరికృష్ణారెడ్డి

అబిడ్స్: గవర్నమెంట్ డెంటల్ కాలేజెస్, హాస్పిటల్స్ అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ దయానంద్ సమక్షంలో ఎన్నికలు జరిగాయి. నూతన అధ్యక్షుడిగా ఉస్మానియా ఆస్పత్రి సీనియర్ డెంటల్ వైద్యులు డాక్టర్ సిరాజ్ ఉర్ రహ్మాన్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ హరికృష్ణారెడ్డి, కోశాధికారిగా డాక్టర్ వెంకటరమణను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైనవారు మాట్లాడుతూ.. ఆస్పత్రి అభివృద్ధికి, ఉద్యోగుల ఉన్నతికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా నూతన కార్యవర్గులుగా పలువురు డాక్టర్లను ఎన్నుకున్నారు.

అభినందనలు



ఆశీర్వాద్ సక్సేనా

చార్మినార్: న్యూ ఢిల్లీలో ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2022లో తెలంగాణ స్టేట్ సైక్లింగ్ టీమ్ తరపున తెలంగాణ సైక్లిస్ట్ ఆశీర్వాద్ సక్సేనా పాల్గొని బ్రౌజ్ మెడల్ సాధించాడు. ఖేలో ఇండియా గేమ్స్‌లో బ్రౌజ్ మెడల్ సాధించిన ఆశీర్వాద్ సక్సేనాకు తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయలు ప్రత్యేకంగా అభినందించారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎండీ జహంగీర్, చిత్రంలో రబ్బాని, ఎంవీ.ప్రసాద్, నరేష్

నాంపల్లి: తెలంగాణ తూనికలు, కొలతల తయారీదారులు, వ్యాపారస్తులు, మరమ్మతుదారుల సంఘం (టీఏఎండీఏఆర్) డైరీ 2023 ఆవిష్కరణ సభ శనివారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో జరిగింది. సంఘం అధ్యక్షుడు రబ్బాని అధ్యక్షతన జరిగిన డైరీ ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ జహంగీర్ హాజరై ప్రసంగించారు. లైసెన్స్‌దారుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రబ్బాని మాట్లాడుతూ..లైసెన్స్‌దారులకు సామూహికంగా భీమా వర్తింపజేయాలని విన్నవించారు. ప్రధాన కార్యదర్శి ఏవీ ప్రసాద్, కోశాధికారి నరేష్, సభ్యులు అజిత్, గిరిధర్, ఎహ్మద్ అలీ, సత్యప్రసాద్‌తో పాటుగా ఇతర జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరై ప్రసంగించారు.

'కరాటే యువతలో ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అఫ్జల్‌గంజ్: కరాటే యువతలో ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, నగర గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం గౌలిగూడలోని ఆయన కార్యాలయంలో 3వ నేషనల్ ఓపెన్ కరాటే, కుంగ్ ఫూ ఆల్ స్టైల్ చాంపియన్‌షిప్ పోటీల పోస్టర్‌ను ఆర్గనైజర్‌లు డాక్టర్ రవి, లక్ష్మీసామ్రాజ్యంలతో కలిసి ఆవిష్కరించారు. ఈ పోటీలు ఈనెల 5న ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు

మలబార్‌లో జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్



జెమ్ స్టోన్ ఆభరణాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

గోల్కొండ: వినియోగదారుల విశ్వాసం చూరగొనడమే తమ ప్రధాన లక్ష్యమని మెహిదీపట్నం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్ హెడ్ రమీజ్ అన్నారు. శనివారం షోరూంలో జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ విదేశల్లో తమ షోరూంలు ఉన్నాయని, అన్ని ప్రాంతాల్లో తాము కొనుగోలుదారుల ఆదరణ పొందుతున్నామన్నారు. తమ కొనుగోలుదారులకు మలబార్ 10 వాగ్ధానాలు ఇచ్చి వాటిని పక్కాగా అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మలబార్ వినియోగదారులు శేతల్, తనీషా కొనుగోలుదారులతో కలిసి ఆభరణాలను ప్రదర్శించారు. ఈ ఫెస్టివల్ ఈనెల 20వ తేదీ వరకు ఉంటుందని ఆయన తెలిపారు.

వీనస్ హైస్కూల్‌లో 'రాహే హిదాయా'



విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువల ప్రాధాన్యం కూడా వివరిస్తుండాలని వీనస్ హైస్కూల్ కరస్పాండెంట్ మహమ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. శనివారం పాఠశాల ఆడిటోరియంలో 'రాహే హిదాయా'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ విద్యా సంస్థల్లో సత్ప్రవర్తన, నైతిక విలువల బోధనకు అత్యంత ప్రాధాన్యమిస్తామన్నారు. విద్యార్థులకు దేహదారుఢ్యంపై సైతం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, భిన్నత్వంలో ఏకత్వం తదితర అంశాలు సైతం పాఠ్యాంశాలకు తోడుగా బోధిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కోర్సులు, సబ్జెక్టులలో ప్రతిభ కనబర్చిన వారికి మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధి సయ్యద్ ఆరిఫ్ తదితరులున్నారు.

ఈఎన్‌టీ ఆస్పత్రిలో బాజిరెడ్డికి వైద్య పరీక్షలు



సుల్తాన్‌బజార్: కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఈఎన్‌టీ ఆసుపత్రికి వచ్చారు. ఆయనకు ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ రవిశంకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో తూంకుంట రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: గూడ్స్ రైలు ఢీకొని ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 60 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తు తెలియని వ్యక్తి హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు.

ఇద్దరు పిల్లలతో సహా గృహిణి అదృశ్యం

డబీర్‌పురా: ఇద్దరు పిల్లలతో సహా ఓ గృహిణి అదృశ్యమైన ఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాలికబర్‌కు చెందిన ఎం.డెబోరా (22), బి.రాజులు దంపతులు. వీరికి రాబిన్ ఆలియాస్ బన్నీ (3), రిచర్డ్‌సన్ ఆలియాస్ యాస్ (11 నెలలు)లు సంతానం. ఈనెల 2న రాత్రి 10:45 గంటలకు డెబోరా తన ఇద్దరు పిల్లలతో కలిసి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన భర్తతో పాటు కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు



మాట్లాడుతున్న రేణుకా యారా

యాకుత్‌పురా: సరైన అవగాహన ఉంటే కేన్సర్‌ను జయించవచ్చునని సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ రేణుకా యారా అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పురానీహవేలిలోని సిటీ సివిల్ కోర్టులో కేన్సర్‌పై అవగాహన సదస్సు, కేన్సర్ బాధితుల కోసం ఎం.ఎన్.జే కేన్సర్ వైద్యశాల బ్లడ్ బ్యాంక్ కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చీఫ్ జడ్జి రేణుకా యారా మాట్లాడుతూ.. ఆత్మస్థైర్యంతో ఎలాంటి సమస్యలైనా పరిష్కరించవచ్చునని.. కేన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులను సైతం గుండెధైర్యంతో ఎదుర్కోవాలన్నారు. అపోలో వైద్యశాల సర్జికల్ అంకాలజిస్ట్ అజేశ్ రాజ్ సక్సేనా, డాక్టర్ మాధురి, ఎం.ఎన్.జే కేన్సర్ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ లక్ష్మీ కేన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడికి ఆరోగ్యంగా జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించిందని, ఆ హక్కు సక్రమంగా వినియోగించుకునేలా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కేన్సర్ అవగా హన సదస్సులు, ఎం.ఎన్.జే.కేన్సర్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ప్రజలకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. ఈ రక్తదాన శిబిరంలో ఏ.ఐ.పీ.ఐ.ఎఫ్ సంస్థ సభ్యులు నూరుద్దీన్, సిటీ సివి ల్ కోర్టు న్యాయ శాఖ సిబ్బంది, న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో..

సుల్తాన్‌బజార్: కేన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే తగ్గుముఖం పడుతుందని తద్వారా రోగి ప్రాణాలు కాపాడవచ్చని వైద్యులు డాక్టర్ సునీత, నివేద్‌రావు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కేన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమన్నారు. ఈ వ్యాధిపై అన్ని విద్యాసంస్థల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఇస్కాన్ కూకట్‌పల్లి అధ్యక్షుడు మహాశృంగార్‌దాస్ పాల్గొన్నారు.

కేటీఎస్ స్కూల్‌లో..

జియాగూడ: కేన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పూరాణాపూల్, రహీంపురా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ బెన్ని అన్నారు. ఈ మేరకు శనివారం ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేటీఎస్ స్కూల్‌లో విద్యార్థులు ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. బెన్ని మాట్లాడుతూ... కేన్సర్ వల్ల అనారోగ్య మరణాలను తగ్గించడమే కేన్సర్ దినోత్సవ లక్ష్యమన్నారు.